అరుణోదయం

కోసలనాగభూషణం

"సరిగా పదేళ్ల కిందట ఆనందరావనే అతను వేసేడు ఈ బొమ్మని" వెడల్పాటి చేకుబద్దని ఆధారంగా గోడకి ఏటవాలుగా తగిలించివున్న ఓ ఆయిల్ పెయింట్ చిత్రాన్ని చూపుతూ అన్నాడు కుందన్‌లాల్.

ఎదురుగా సోఫాలో కూచుని తదేకంగా దానికేసే చూస్తూ "చాలా బావుంది. ఎవరు వేసేరు దీన్ని?" అని అడిగిన రగంస్వామి ఆ సమాధానం విని కొంత ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసేడు.

"రియల్లీ ఎ ఫైన్ పిక్చర్!" అని మరోసారి దాన్ని మెచ్చుకున్నాడు.

కుందన్‌లాల్ ఆ మద్రాసు మహా

నగరంలోనే ఓ పేరెన్నికగన్న వ్యాపారి. రంగస్వామితో కలిసి తను మేనేజింగ్ పార్టనర్‌గా పెద్ద ఇండస్ట్రీని నడుపుతున్నా డతను. అదిగాక ఆ మధ్యనే తండయార్‌పేట్‌లో స్వంతంగా ఓ కలపదుకాణం, ఇటుకల ఫ్యాక్టరీ పెట్టుకున్నాడు. అక్కడా ఇక్కడా తనకు నమ్మకమైన స్నేహితుల్ని వుంచి ఆ రెండింటినీ వాళ్ళచేతే మేనేజ్ చేయిస్తున్నాడు.

కుందన్‌లాల్ ఒంటరి. అతనికి నా అన్నవాళ్ళెవరూ లేరు. ఎక్కడో మైసూర్‌లోనూ, మధ్యప్రదేశ్‌లోనూ వ్యాపారరీత్యా వెళ్ళి అక్కడే సెటిలయిన బంధువులుంటారంటాడుగాని వాళ్ళెవరూ ఇతన్ని చూడ్డానికి రారు. ఇతనూ వాళ్ళదగ్గరకి వెళ్ళడు.

కుందన్‌లాల్ మొదట్లో ఎల్లా వుండేవాడో తెలియదుగాని జపాన్‌నుంచి ఇంపోర్ట్‌అయిన టెరిలీన్ బట్టల కొనుగోలులో పరిచయమయ్యేడు రంగస్వామికి. టన్నుల లెక్కలో స్టాక్ అయిపోయిన బట్టల్ని బ్లాక్‌గా సిటీలోని ఓ పెద్ద పార్టీకి నిమిషాలమీద ఆఫర్ చేసి తనకి అత్యంతాశ్చర్యజనకంగా మార్కెట్‌లోకి దింపించేసేడు కుందన్‌లాల్. ఆ సీజన్‌లో అప్పటికొచ్చిన లాభం మాత్రం ఎనభై వేలు. ఆ బిజినెస్‌లోని టాక్టిక్స్‌ని మెచ్చుకుని ఆ లాభంలో తనే సగం అతనికిచ్చేడు రంగస్వామి.

అప్పట్నుంచి రంగస్వామి కుందన్‌లాల్‌తో కలిసే చేయసాగేడు వ్యాపారాన్ని. పండగపబ్బాలకి తమ ఇంటికి ఆహ్వానిస్తూ తమ సుఖసంతోషాలతో కొంతకొంతగా వెలిగించసాగేడు అతని ఒంటరి జీవితాన్ని.

వస్తువులు, కొనుగోలు, అమ్మకాలు, చెక్కులు, బిజినెస్ లెటర్లు, సంతకాలు అంతా ప్రాణంలేని వస్తువులతోనూ, కాగితాలతోనూ నిండిపోయి కుందన్‌లాల్ జీవితం నిస్సారంగా ఎండిపోయింది. చీకటి బజారు వ్యాపారం అతని పరిసరాలని డబ్బులతో నింపినట్టే చీకటితోనూ నింపిపోయింది.

ఎప్పుడయినా తీరిక దొరికిన సమయాల్లో అతనికి జీవితాన్ని గురించి గుర్తుచేయబోతే వారించేవాడు రంగస్వామిని. పోనీ ఈ లోకంలో డబ్బులతో కొనుక్కోదగిన అందాలనీ, అనుభవాలనీ అయినా ఆశిస్తాడా అంటే అసలా ధ్యాసే తనకి వున్నట్టుకనబడదు. వ్యాపార వ్యవహారాల్లో మినహాయించి స్నేహితుల మధ్య ఉన్నప్పుడు చాలా సెంటిమెంటల్‌గా వుంటాడు. అన్నిటికన్నా మనిషికి నైతిక విలువలే ముఖ్యమంటాడు. విస్కీ సీసాలు, ఆడపిల్లలు నాగరికత వేదికనెక్కి నర్తించే ఆటవికతకి అఘోరించిన అలంకారాలంటాడు.

ఇక అల్లాంటి కుందన్‌లాల్‌కి ఏమని సలహా ఇవ్వగలడు రంగస్వామి?

మొన్నమొన్నటివరకూ తనకంటూ దేన్నీ సమకూర్చుకోని అతను 'చివరికి తనదంటూ కనీసం ఇదయినా మిగలనీ' అని లక్షరూపాయల కాంట్రాక్టింగ్‌తో ముచ్చటైన ఓ రెండంతస్తుల మేడని కట్టించుకున్నాడు.

ఆ ముందటిరోజే బిజినెస్ మాగ్నెట్స్ అనిపించుకున్న తన స్నేహితులందరినీ ఆహ్వానించి వారిచ్చే శుభాశంసల నందుకుంటూ గృహప్రవేశం చేసేడు. పెద్దయెత్తున అందరికీ పార్టీ ఇచ్చేడు.

ఆ పార్టీ ముగిసేక తమ తమ బెటరాఫ్‌లతోనూ, పిల్లలతోనూ స్కూటర్ల మీదా, కార్లలోనూ వెళ్ళిపోతున్న గెస్టులకి కారిడార్‌లో నుంచుని వీడ్కోలు చెప్పేడు కుందన్‌లాల్.

వాళ్ళందరూ వెళ్ళిపోయేక తన తోటే నిలిచిన రంగస్వామితో కలిసి ఇంట్లోకి నడిచేడు. అంతవరకూ అప్తులతో, విందులు వినోదాలతో కళకళలాడిన ఆ మేడ ఒక్కమారుగా కళావిహీనమై తోచింది అతనికి. తిన్నగా శాళ్లీడ్చుకుంటూ వచ్చి సోఫాలో కూలబడిన కుందన్‌లాల్ కళ్ళవెంట మొట్టమొదటిసారిగా కన్నీళ్ళని చూసేడు రంగస్వామి. చలించిపోయేడు క్షణం సేపు. తనూ అతని పక్కనే కూచుంటూ అన్నాడు లాలనగా, "కుందన్‌లాల్ ! అడిగినా చెప్పవు నీ వెనకటి స్థితిగతుల్ని. పోనీ గతాన్ని మరిచి కొత్తగా అయినా జీవితాన్ని ప్రారంభిస్తావంటేనా ససేమిరా ఒప్పుకోవు. ఏమిటి నీ ధోరణి ? ఎంత కాలం వుంటావు ఇలా ఒంటరిగా ?"

కుందన్‌లాల్ కోటు జేబులోంచి చేరుమాలు తీసి కళ్ళొత్తుకున్నాడు.

"నో.... నో నథింగ్ లైక్‌దట్ మిస్టర్ స్వామి ! ఏదో గతం తాలూకు ఓ అందమైన జ్ఞాపకం. ఆ ఆనందం పట్టలేకే ఈ కన్నీళ్ళు - అందుకు ఆనవాళ్లుగా." నవ్వడానికి ప్రయత్నించేడు కుందన్‌లాల్. చివరికి నవ్వేడు కూడా. అయినా రంగస్వామికి తెలుసు ఆ నవ్వు నవ్వు కాదని - అది వట్టి కాగితం పువ్వే అని !

మొత్తానికి కుందన్‌లాల్ జీవితంలో చాలా బాగా దెబ్బతిన్న వ్యక్తి. అతని గతంలో కొంత చీకటి వృత్తాంతం వుంది. ఐశ్వర్యంతో, హోదాతో అతనిప్పుడు సంపాయిస్తోన్న వెలుగు వెలిగించడం లేదు ఆ చీకటిని. ఆ చీకటినే కళ్ళవెనక దాచుకుని ఒకప్పుడు తనని శాసించిన జీవితాన్నే తనిప్పుడు శాసిస్తున్నాడు తనకి తెలియక ఆ శాసనాన్ని, శిక్షని తనే అనుభవిస్తున్నాడు.

"ఇదీ నా పూర్ణ వ్యక్తిత్వం" అని తన ముందు నిలబడగలదా కుందన్‌లాల్ ఎప్పటికయినా? అసలా అవకాశం తనకి కలిగిస్తాడా ?"

"ప్చ్. లాభం లేదు. మొండి మనిషి"

మనస్సు నంతటితో కట్టేసుకున్నాడు రంగస్వామి.

"సరే అయితే.... ఇప్పటికింకేం చేస్తావు? పిక్చర్ కెళదాం రా! "ఎంటర్ ది డ్రాగన్" "ఆనంద్"లో. జీవితంలో దెబ్బలాడే మనిషివి. మనుషులతో దెబ్బ లాడడం ఎలాగో చూడాలి నువ్వు తప్పక." లేవదీసేడు బలవంతాన కుందన్ లాల్‌ని.

సినిమా చూసి, దార్లో వస్తూ 'సంగమ్'లో డిన్నర్ కానిచ్చి తన కార్లోనే కుందన్‌లాల్‌ని ఇంటి దగ్గర డ్రాప్‌చేసి 'గుడ్ నైట్' అంటూ వెళ్ళేడు రంగస్వామి.

కుందన్‌లాల్ నిలుచున్నది వెలుగుల మేడలోనే అయినా అతను చీకటి ఎడారిలో ఒంటరి బాటసారిలాగానే అనిపించేడు రంగస్వామికి.

ఆ రాత్రంతా అతని టాలూకు ఆలో చనలతోనే గడిపిన రంగస్వామికి ఆ మరుసటి పుదయం పదిగంటలకల్లా ఫోన్ చేసేడు కుందన్‌లాల్ "ఇవాళ చుట్టాలొస్తున్నారు మా ఇంటికి" అని.

అందులో ప్రత్యేకంగా వినిపించిన 'మా ఇంటికి' అనే మాటని విని పాతిక సెకన్లవరకూ ఏమాటా చెప్పలేదు రంగ స్వామి.

"వాట్ స్వామీ? వింటున్నావా?" అని మళ్ళీ కుందన్‌లాల్ రెట్టించి అడి గితే_అప్పటికి తేరుకుని

"ఎస్....ఎస్. సడన్‌గా సర్‌ప్రయిజ్ అయ్యేను. వాటీజ్ ది మేటర్? చెప్పవా ఆ చుట్టాలెవరో?" కుతూహలంగా అడిగేడు రంగస్వామి.

"నో! నేన్చెప్పను. నువ్విప్పుటికి ఆఫీస్ పనులన్నీ అసిస్టెంటుకి అప్ప జెప్పి ఇక్కడికి కొచ్చేసెయ్ వెంటనే_ స్వయంగా చూద్దువుగాని చుట్టాన్ని. ముందుగా తెలిసినా నేన్నీకు చెప్పని ఆ చుట్టాన్ని గురించి ఊహించు కొంత. ఫీల్ దట్ థ్రిల్. బై" అవతల ఫోన్ డిస్‌కనెక్ట్ చేసిన చప్పుడు.

కుందన్‌లాల్ మాటలు ఫోన్‌లోనే వినిపించినా సంతోషంతో ఆ కంఠం ఎంతలా వొణికిందో, మాటల్లోకి ఆ సంతోషం ఎలా వెల్లువలా ఉరికిందో అర్థమైంది రంగస్వామికి. చకచకా తనే అర్జెంటయిన ఆర్డర్లకి సంతకాలు చేసేసి, తక్కిన ఆఫీస్ పనులకి అసి స్టెంట్‌ని పురమాయించి మరో అరగంట కల్లా కుందన్‌లాల్ ఇంటిముందు వొచ్చి వాలేడు రంగస్వామి. కార్లోంచి దిగీ దిగగానే ఇంట్లోకెళ్ళి ఎదురయిన పని మనిషిని 'అయ్యగారేరీ' అని అడిగి, అతను డ్రాయింగ్‌రూంలో వున్నాడని తెలుసుకుని మేడమెట్లెక్కి ఆ రూంలోకి అడుగుపెట్టేడు.

అక్కడ కిటికీకి పక్కగా, గోడకి చేరువగా నుంచుని తలకి కొంత ఎత్తు లోనే వున్న ఓ ఆయిల్‌పెయింట్

చిత్రంకేసే చూస్తూ నిశ్చలంగా వున్న కుందనలాల్‌ని చిత్రంగా చూసేడు రంగస్వామి. అతనిలో ఆనాడే మేల్కొన్న మరో కొత్త వ్యక్తినీ చూసేడు. ఇలా అతన్ని చూస్తూనే సోఫాలోకి చేరుకుని తన ముందున్న చిత్రం కేసి మళ్ళేడు.

ఉధృతమైన గాలికి అల్లాడిపోతూ ఎగిరే వస్త్రంతో నిండిన ఆకాశంకింద చెట్టూ చెట్లు విరిగి, కొండలు కూలి పడనున్న అనాథమైన లోయలో అసహాయంగా చేతులు పైకెత్తి నిలబడ్డ వ్యక్తి చిత్రం అది.

అందులో రేఖలకీ, రంగులకీ అద్దిన ఏదో విచిత్ర విషాదం దాన్ని చూస్తోన్న కళ్ళల్లోంచి అతని హృదయంలోకి పాకింది.

ఆ తన్మయత్వంలోంచి తేరుకుని కొన్ని నిమిషాల తర్వాత అన్నాడు రంగస్వామి, "చాలా బావుంది. ఎవరు వేసేరు దీన్ని?" అని.

పరిసరాలని మరిచి ఆ తలపులోనే మునిగిన కుందన్‌లాల్ ఒక తడినవ్వుతోనే మిత్రుణ్ణి పలకరించి అన్నాడు సమాధానంగా. "సరిగా పదేళ్ళ కిందట ఆనందరావనే అతను వేసేడు ఈ బొమ్మని."

* * *

"ఎన్నాళ్ళకి విన్నాను నీ నోటంట నీ గత చరిత్రలోని నాకు తెలియని ఓ వ్యక్తి పేరు!" తనకి తనే ఆనంద పడిపోయేడు రంగస్వామి. అడిగేడు అతన్ని, "ఆనందరావెవరు? నీ ఫ్రెండా? బంధువా?"

"రెండూను. నా ప్రాణంలో ప్రాణం ఆనందరావు — నాకు మిగిలిన ఒకే ఒక్క చేదు జ్ఞాపకం."

కుందన్‌లాల్ అక్కడినుంచి కదిలి తన పడకకి చేరువగా గదిగోడలో అమర్చిన బజర్‌ని నొక్కి మళ్ళీ వొచ్చి కూచున్నాడు రంగస్వామి కెదురుగా.

అతని వెనకే ఓ కుర్రాడు వొచ్చేడు రెండు కాఫీ కప్పులతో. చెరో కప్పూ ఇచ్చేడు. ఆ గదిలోనే టేబుల్ పైనున్న యాష్‌ట్రేని తెచ్చి సోఫాముందటి స్టూల్ మీద వుంచేడు. ఖాళీ అయిన కప్పుల్ని తీసుకుని వెళ్ళిపోయేడు కిందికి.

రంగస్వామి పైప్ వెలిగించేడు

కుందన్‌లాల్ చెప్పడం సాగించేడు.

"ఏడేళ్ళకి కిందటనుండీ ఆనందరావి బొమ్మలు వెయ్యడం. అప్పటికి కొంత ఇంచుమించుగా పాతికేళ్ళు వుండేయి అతనికి. అతని తెలివితేటలకి గుర్తింపుగా యూనివర్సిటీవాళ్ళిచ్చిన ఫస్ట్ క్లాస్ సర్టిఫికెట్లూ వొచ్చింది చేతికి. అప్పట్లో వుద్యోగాల పరిస్థితులు ఇప్పుడున్నట్టు లేవు. ఇప్పుడయితే పోస్ట్‌గ్రాడ్యుయేట్ అయినా టెక్నికల్‌గానో, మరో విధంగానో, స్వశక్తిమీద ఆధారపడి సంపాదనాపరు డవుతున్నాడుగాని పట్టభద్రుడయిన ప్రతి

వాడూ ప్రభుత్వోద్యోగమే చెయ్యాలనుకునే రోజులవి. ఆనందరావు వుద్యోగం కోసం అన్వేషించటం ఆ ఉద్దేశంతో కాకపోయినా అతనిలా అన్నివిధాలా అర్హత ఉన్న వాళ్ళని ప్రభుత్వం గుర్తించలేనంత గడ్డుపరిస్థితుల్ని సృష్టించేరు ప్రజలు ఆ రకమైన మెంటాలిటీతో. దానితో ఇంటర్వ్యూలకి కొండంత ఆశతో వెళ్ళే ఆనందరావు వెళ్ళిన ప్రతిచోటినుంచి నిరాశతోనే తిరిగొచ్చేవాడు. నిట్టూర్చేవాడు.

ఇప్పుడిలా నేను సెటిల్డ్ అయిన జీవితంలో, ఎయిర్ కండిషన్డ్ గదుల్లో, కుషన్ పరుపుల్లో తీరిగ్గా తిని కూచుని వెనక్కి తిరిగి చూస్తోంటే ఇప్పటికి ఆ విషాదంలోని ఒత్తిడి తగ్గి కొంత మాలిమిగా కనబడుతున్నాయి గాని నిజానికి ఆ ఆనందరావు అనుభవించిన చిత్రహింస, ఎదుర్కొన్న చేదు అనుభవాలు ఎంతో ఘోరమైనవి!

అతని జీవితం వడ్డించిన విస్తరి కాదు.

చిన్నప్పుడే నాన్నగారు పోయిన అతని కుటుంబానికి అతను తప్ప వేరే ఆధారమేమీ మిగల్లేదు. ఎదిగిన చెల్లెలు, దైన్యానికి మారురూపంగా నిలిచిన తల్లి ఇంట్లో పూట గడవదు. ఉన్న ఒకటీ రెండు నగలూ అమ్మి ఇంటర్వ్యూలకి ఖర్చులకింద వాడుకోవడం. కళ్ళని మెరిపించే కరెన్సీ నోట్లుగాని, ఒళ్ళు దగ్గరుంచి ఉద్యోగం వేయించే పై అధికారుల రికమెండేషన్ లెటర్లుగాని లేవు ఆనందరావుకి — నిద్రాహారాలు మాని తను కష్టపడి సాధించుకున్న సర్టిఫికెట్ ఒక్కటి తప్ప. బంధువుల్లేరు. అవసరాలకి ఆదుకునే ఆప్తుల్లేరు. పైగా అప్పులవాళ్ళ పోరు. చివరికి ఇల్లుకూడా తెగనమ్మి, తన రెక్కల కష్టాన్నే నమ్మి అమ్మాచెల్లెళ్ళతో వేరే వూరికి తరలిపోయేడు ఆనందరావు.

ఆ వూళ్ళోనే పి డబుల్యు డిలో క్లర్కుపోస్టుకి ఇంటర్వ్యూకి వెళ్ళి, ఆ వుద్యోగం రాక అక్కడే కాస్త కనికరం చూపగలిగిన ఓ కంట్రాక్టర్ని బతిమాలి రోజువారీ కూలీగా రాళ్ళు మోసే పనిలోకి కుదిరేడు.

ఒకనాడు ఆ వూరికి వెలుపల ట్రావెలర్స్ బంగళా నిర్మాణం జరుగుతోందగా, "ఈ వర్కింగ్ స్పాట్ తాలూకు లే-ఔట్ మరిచిపోయేను. ఇంటికెళ్ళి తీసుకురా." అని ఆ కంట్రాక్టర్ వురిమితే వాళ్ళింటికి వెళ్ళేడు ఆనందరావు. ఇంటిముందు కనిపించిన కంట్రాక్టర్‌గారి కొడుకుకో విషయం చెప్పి పంపేడు. వాడు వెళ్ళి ఆ చెప్పడానికేమో నోరు తిరక్క "మిమ్మల్నే రమ్మంటున్నా"రని చెప్పి వీధిలోకి పారిపోతే...

భుజంమీది తువ్వాలుతో మొహానికి పట్టిన చెమటని తుడుచుకుంటూ లోపలికి వెళ్ళి...

"ఏం తెమ్మన్నారండీ! నాన్నగారు" అంటూ వొచ్చిన ఓ ఆకారాన్ని చూసి అలానే స్థాణువులా నిలబడిపోయేడు ఆనందరావు."

అగేడు కుందన్‌లాల్, అడిగేడు రంగస్వామిపు, "ఊహించగలవా అతని కెదురైన ఆ వ్యక్తి ఎవరో?"

అమాత్రం ఆలస్యాన్ని భరించలేక చెప్పమన్నట్టు కళ్ళతోనే త్వరపెట్టి పైప్‌ని పక్కన పడేసిన రంగస్వామితో చెప్పసాగేడు కుందన్‌లాల్. "ఆవ్యక్తి ఆనందరావుతోటే మూడేళ్ళపాటు కలిసి చదువుకున్న అతని స్నేహితురాలు సీలిమ. అంతమాత్రమే కాదు. అతని కాలేజీ జీవితంలోనూ అతని ఆకర్షణకు లోనై, తనకి తనే చేరువై అతని జీవితంలోనూ పాలుపంచుకోవాలని ఆశించిన సీలిమ. అంతస్తులు వేరు, తనున్న స్థితిగతులు వేరు అని ఆ చివరిరోజుల్లో అతనిచేత లాలనతో తిరస్కరింపబడిన సీలిమ. మనసు అద్దంలో ప్రతిఫలించిన ఆనందరావు ఆకారాన్ని మరెన్నటికీ చెరిపివేసుకోలేని సీలిమ!

"పాతికేళ్ళ వయసులో జీవితాన్ని రంగులస్వప్నంలా మార్చుకోవాలన్న తపనతో అహర్నిశమూ ఆలోచించి శ్రమించే ఆ యువకుని ఆత్మవిశ్వాసం మీద అలా ఆనాడు ఆమెని కినుకించ జేసిన ఆ దుస్థితి ఎంతగా దెబ్బతీసి వుంటుందో ఒక్కమాటు ఆలోచించు!

"అలా ఆమెని చూసి నోటమాటరాక ఆమె తనని వెనక చేరి పిలుస్తున్నా వినిపించుకోక, "ఇదీ సీలిమా! నీకూ నాకూ నడుమనున్న తేడా," అని ఆ కాగితాలని అడిగి తీసుకుని వెళ్ళి కంట్రాక్టర్‌కిచ్చి "ఒళ్ళు బాగోలేదు. ఇవాళ సెలవిప్పించండి" అని ఇంటికి తిరుగుముఖం పట్టి పాడయిన మనస్సుతో ఆ రోజల్లా ఇంట్లోనే కూలబడిన ఆనందరావుకి___

"అన్నయ్యకి సాయంగా వుంటుంది. నేనూ వెళతానమ్మా! పనిలోకి" అని అమ్మతో చెప్పి ఆ వుదయం ఆ వాడలోని కలిగిన వాళ్ళ మేడలోకి పాచిపనికి వెళ్ళిన చెల్లెలి శవం సాయంత్రానికల్లా ఎదురయితే.

"ఎంతటి ఆ అఘాయిత్యానికీ ఆడపిల్లల శీలంతో ఆడుకునే ఆ మేడలోని దొరబాబే కారకుడని తెలిస్తే—

"అప్పుడిక ఎల్లా వుంటుందతని క్షోభ! ఎంత క్రోధం, ఎంత కక్ష, ఎంత ఆవేశం అగ్నిశిఖల్లా ఆవరించి వుంటాయతన్ని!

"వెంటనే ఉన్నఫళంగా ఆనందరావు వారించే అమ్మని తోసి ఆ మేడలోకి దూసుకెళ్ళి మందుమత్తులో మునిగితేలే ఆ నరరూపరాక్షసుడి కంఠాన్ని పట్టుకు నులిమి చంపి పారేసి వెన్నంటితరిమే పోలీసుల బారినుండి తప్పించుకుని

తప్పించుకుని పారిపోయేడు [illegible]వెంట నాలో ఓ జ్ఞాపకంగా మిగిలిపోయేడు.

*కాలం తీరి కట్టుకున్న భర్తా, కాలం కలిసిరాక కన్నకూతురూ, కొడుకూ తననించి దూరమైతే ఏ ఆధారమూలేక తనవాళ్లెవరూ లేనిచోట దిక్కులేనిదై ఆ తల్లి ఏమయిందో! ఒకవేళ హంతకుడైన కొడుకు ఆచూకీ చెప్పమని గదమాయించే పోలీసుల నిర్బంధంలో వుండి దిగులుతో, బాధతో క్రుంగి, కృశించి, జబ్బునపడి చివరి క్షణాల్లో తన మొహంలోకి చూస్తూ కన్నీళ్ళు విడిచే

ఆస్తులు దగ్గరలేక ఎల్లా కాలగర్భంలో కలిసిపోయిందో!"

కుందన్‌లాల్ చిన్నపిల్లాడేఅయ్యేడు. ఉబికే కన్నీళ్ళని ఆపుకోలేకపోయేడు.

ఆనందరావు గీసిన బొమ్మ తనలో కలిగించినంతటి విషాదాన్నే అతని కథా కలిగించగా అందులోంచి మరి కాసేపటికి తేరుకుని అడిగేడు రంగస్వామి సంశయంగా "అయితే ఈ ఫోటో, అతనంతకుముందే ఇచ్చేడా నీకు?"

కుందన్‌లాల్ తనను తానే ఊరడించుకున్నాడు. అన్నాడు "లేదు ఈ చిత్రం అతనప్పట్లో వేసింది మాత్రం కాదు."

"మరి ఆనందరావు దేశాంవెంట పారిపోయిన తర్వాత కూడా నీకు కనిపించి వుండాలన్నమాట! లేకపోతే అతని చిత్రం ఆపైన నీ చేతికి రావడానికి వీల్లేదుగా."

కుందన్‌లాల్ కొంత ఆలోచించేడు.

"నిజమే. అసలు సంగతి చెప్పాలి అలా వూళ్ళవెంట పారిపోయిన ఆనందరావు మరెక్కడికో వెళ్ళలేదు. తిరిగి తిరిగి ఈ మద్రాసుకే వొచ్చేడు. ఈ పనీ ఆ పనీ అనకుండా దొరికిన ప్రతిపనీ చేసేడు బతుకుతెరువు కోసం! ఆఖరికి హోటల్ ప్రొప్రయిటర్ ధర్మమా అంటూ అతనికి తెలిసినవాళ్ళ సాయంతో కళాసీగా చేరేడు హార్బర్లో. అలా కొంతకాలం అక్కడే గడిపి ఓ రోజున అనుకోకుండా ఆత్మహత్య చేసుకున్నాడు ఆనందరావు."

"వాట్....ఆత్మహత్యా! బ్రతుకుకి ఓ ఆధారం అంటూ దొరికేక అంతపనీ ఎందుకు చేసుకోవాలి అతను?" సోఫాలోంచి లేచి మరుని ప్రశ్నించేడు రంగస్వామి.

"అది ఆత్మహత్య ఓ రకంగా! తనని తనే—వ్యక్తిత్వాన్నే చంపుకోవడం. మొదటిసారిగా ఫారెన్‌నుంచి వొచ్చిన ఓ ట్రాన్సిస్టర్ని హార్బర్లో దొంగిలించి బ్లాక్ బజార్లో చాటుగా అమ్ముకోవడం!

ఆరాత్రే తన ఆనందానికి కారణాలు కావలసిన ఆ రంగులూ కాన్వా, ఇంకా నేలలో ఎల్లా పసలాలిక విరిగిపడి తన జీవితాన్ని బలిగొన్నాయో ఊహించి, దానివెనక తన వ్యక్తిత్వాన్ని సమాధి చేసిన సమాజం పంపించిన సందేశంగా సూచించి ఈ చిత్రంలో తనే వస్తువయ్యేడు ఆనందరావు.

"అదే మొదటి అతని జీవితంలో స్మగ్లింగ్. వేలకి వేలు, లక్షలకి లక్షలు సంపాయించి పైనున్నైన ఆ స్మగ్లింగ్‌కి స్వస్తిచెప్పి ఈ సిటీలోనే ఓ పెద్ద వ్యాపారమని చెప్పుకుంటూ గుప్పెట్లోంచి పాములా జారిన గతాన్ని, జీవితాన్ని మననం చేసుకుంటూ పేకమేడల్లాంటి వ్యక్తిత్వాన్ని ఎల్లాగో గడుపుతున్నాడతను."

రంగస్వామి సోఫాలోంచి కదిలి నిటారుగా కూచుని అడిగేడు ఆత్రుతగా "ఈ సిటీలోనేనా ? ఎక్కడ ?"

"ఇదిగో ఇక్కడే! నీ ముందే— పోలీసులకి భయపడి పారిపోయున్నాడు మార్చేసుకున్న పేరుతో!"

ఆశ్చర్యపోయేడు రంగస్వామి. అమాంతంగా కౌగలించుకొన్నాడు అతన్ని.

ఆ సమయానికే కాలింగ్ బెల్ మోగితే రంగస్వామితో కలిసి మేడ మెట్లు దిగేడు. ఆనందరావు ఉరఫ్ కుందన్‌లాల్ ! తొందరగా కారిడార్‌లోకి నడిచేడు.

అప్పుడే ఇంటిముందాగిన టాక్సీ లోంచి దిగిన వ్యక్తిని పలకరించేడు. ఆమె చేతిని అందుకున్నాడు. ఆమెతో కలిసి రంగస్వామికి ఎదురుగా వొచ్చి నిలిచేడు.

"ఇంతకు ముందే చెప్పేను ఈమెని గురించి. ఇప్పుడు చూస్తున్నావు. ఈవిడే నీలిమ!" చెప్పేడు ఆనందరావు.

అదివరకే అయ్యగారు అంతా తమకి చెప్పినట్టు ఓ పళ్ళెంలో మట్టిగాజులూ, కుంకుమ భరిణా, పువ్వులూ వుంచుకుని వొచ్చింది అక్కడికి వంటమనిషి తాయారు. కొత్తగా వొచ్చిన యజమానురాలికేసి ఆరాధనగా చూసింది.

తెచ్చిన పళ్ళెన్ని పక్కనుంచి బోసిగా వున్న నీలిమ చేతులకి గాజులు తొడిగింది తాయారు.

కూర్చి కట్టిన పువ్వుల్ని సుతారంగా సిగలో తురిమి, భరిణలోంచి కుంకుమ తీసి నీలిమ నుదుటన వుంచేడు ఆనందరావు.

ఆ కుంకుమ తెల్లని బుగ్గల్లో ఇంకా మంచుతెరలు తొలగిపోని తూర్పు దిక్కులా వున్న ఆమె మొహంలో ఎర్రగా సూర్యబింబంలా వెలిగింది.

"ఇన్ని ఏళ్ళ తర్వాత ఇతని చీకటి ప్రపంచాన కూడా ఉషోదయమైంది!" అనుకున్నాడు రంగస్వామి.